జ్వాల తెలుగు న్యూస్

RNI NO: TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

06 ఏప్రిల్ 2026 | మెదక్ | పేజీలు :4 వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 126

# ముహూర్తమెప్పుడు?

## ఇంజనీర్ల ఉదాసీనత.. అన్నదాతకు శాపమా?

## అధికారుల మౌనం.. నిర్మాణ సంస్థకు వరమా?



**మేడిగడ్డలో ఏం జరుగుతోంది?**

**హెచ్చరికలు పట్టించుకోని ఫలితం.. ఇప్పుడు లేఖల చుట్టూ కాలక్షేపం**

**సీఎం ఆదేశించినా కదలని ఫైళ్లు**

**ఇంజనీర్ల వెనుక ఉన్నదెవరు?**

**అన్నదాత ఆశల బ్యారేజ్.. అపరిష్కృత సమస్యల భాండాగారం**

**హైదరాబాద్ ఏప్రిల్ 05:** కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. బ్యారేజీ కుంగిపోయి నెలలు గడుస్తున్నా, పునరుద్ధరణ పనులపై అడుగు ముందుకు పడకపోవడం వెనుక అధికారుల నిర్లక్ష్యం ఉందా లేక నిర్మాణ సంస్థ వ్యూహాత్మక మౌనం ఉందా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఆదేశించినా, కింది స్థాయి అధికారుల నుంచి స్పందన కరువవ్వడం విస్మయం కలిగిస్తోంది.

**లేఖల యుద్ధం.. తీరని కష్టం**

గత రెండేళ్లుగా నీటిపారుదల శాఖ, నిర్మాణ సంస్థ మధ్య కేవలం ఉత్తర ప్రత్యుత్తరాలకే పరిమితమైంది వ్యవహారం. “బాధ్యత మీదే” అని ప్రభుత్వం అంటుంటే, “లోపం డిజైన్‌దే” అని నిర్మాణ సంస్థ తప్పించుకుంటోంది. ఈ లేఖల యుద్ధంలో ప్రాజెక్టు మనుగడ ప్రమాదంలో

మిగతా 2లో



మాకు ‘బ్లాక్ బాక్స్’

# నిజాలు కావాలి!

**“ప్రధానికి బాధితుల లేఖ**

**ఏఐ 171 ప్రమాద రహస్యాలను వెల్లడించండి!”**

**నిజం కోసం బాధితుల పోరాటం**

2

*గతేడాది అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘోర కలికాల్లో తమ వారిని కోల్పోయిన కుటుంబాలు, ఏడాది గడుస్తున్నా నేటికీ ప్రమాదానికి గల అసలు కారణాలు తెలియక ఆవేదన చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో, గుజరాత్‌కు చెందిన 30 బాధితుల కుటుంబాలు శనివారం సమావేశమై, ప్రధాని నరేంద్ర మోదీకి తమ గోడును వెళ్లబోసుకుంటూ లేఖ రాశాయి.*

# వ్యూహాత్మక విజయం

**హర్మూజ్ జలసంధిని**

**దాటిన 9వ భారత నౌక ‘గ్రీన్ ఆశా’**

**ముంద్రా, కాండ్లా పోర్టులకు**

**నిరంతరాయంగా ఇంధన సరఫరా**

2




# టెన్షన్.. టెన్షన్!





**వాష్‌రూమ్‌లో టిష్యూ పేపర్**

**ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు**

**బెంగళూరు ఎయిర్‌పోర్టులో హైడ్రామా**

2



**మృత్యుపాశమైన**

# మినీట్రక్

**5 కిలోమీటర్ల ‘నరకం’.. అయేషా ప్రాణం బలి!**

**చెదిరిన కేరళ దంపతుల కలల**

**మహేశ్వరంలో విషాదం!**

2

## మత్తు వద్దు..

# మైదానమే ముద్దు

**డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం**

**పతకాల వేటలో ‘యంగ్ ఇండియా’**

**ఆత్మగౌరవ ప్రతీకలు నిఖత్, సిరాజ్‌లకు అగ్రపీఠం**

**గోల్డ్ మెడల్ లక్ష్యంగా.. ఫ్యూచర్ సిటీలో స్పోర్ట్స్ వర్సిటీ**

**సీఎం రేవంత్‌రెడ్డి**



2

క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదు, దేశ ప్రతిష్టను ప్రపంచ యవనికపై నిలిపే ఆయుధాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా పోలీసు ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఆయన, క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపుతూనే, దేశంలోని క్రీడా ముఖచిత్రాన్ని మార్చాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.



ఎంఆర్ఐకి...

# హీలియం గ్రహణం

**యుద్ధం అక్కడ.. ప్రాణం ఇక్కడ**

**గ్యాస్ లేదు.. స్కాన్ రాదు**

**పేద రోగికి తప్పని తిప్పలు!**

**మైనస్ 269 డిగ్రీల వద్దే మనిషి ప్రాణం..**

**హీలియం కొరతతో వైద్యుల్లో గుబులు!**

**సరఫరా గొలుసు తెగింది.. సంక్షోభం మొదలైంది!**

**ప్రభుత్వ దవాఖానాల్లో ప్రస్తుతానికి ఊరట..**

**ప్రైవేటులో మాత్రం ‘ధరల’ మంట!**

**హైదరాబాద్ ఏప్రిల్ 05:** సరిహద్దుల్లో పేలుతున్న బాంబులు కేవలం ప్రాణాలనే తీయడం లేదు.. ఇక్కడ వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న రోగికి అందాల్సిన వైద్యానికీ అడ్డుపడుతున్నాయి. మెదడులోని చిన్నపాటి నరాన్ని కూడా స్పష్టంగా చూపించే యంత్రాలు ఇప్పుడు మూలపడే స్థితికి చేరుకున్నాయి. దీనికి కారణం యుద్ధం వల్ల నిలిచిపోయిన ‘లిక్విడ్ హీలియం’ సరఫరా.

**ఏమిటీ వింత సంబంధం?**

సాధారణంగా బైక్ మీద నుంచి పడినా లేదా తీవ్రమైన తలనొప్పి వచ్చినా వైద్యులు ఎంఆర్ఐ స్కాన్ తీయమని చెబుతారు. ఈ యంత్రం పనిచేయాలంటే అందులోని సూపర్ కండక్టింగ్ అయస్కాంతాలు

మిగతా 2లో

# వడగండ్ల వాన.. అన్నదాతకు గుండె కోత

**చేతికొచ్చిన పంట మట్టిపాలు!**

**నిన్నటి వరకు సిరి.. నేడు కన్నీటి దరి**

**ప్రకృతి మిగిల్చిన చేదు జ్ఞాపకం**

**రాలిపోయిన వడ్లు.. కూలిపోయిన ఆశలు**


**వరిమడ్లలో రైతుల రోదన**

**భీమయ్య మామిడి తోటలో విషాదం**

**కౌలు కట్టేది ఎలా.. అప్పు తీరేది ఎలా?**

**విద్యుత్ ఘాతానికి మూగజీవాలు బలి**

**రైతు కుటుంబంలో నిండని లోటు!**



2

ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు శనివారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలను వణికించింది. రంగు మారిన ఆకాశం, ఉరుములు, మెరుపుల మధ్య కురిసిన రాళ్లవాన అన్నదాతల ఆశలపై పిడుగులా పడింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలవాలగా, నోటికాడికి వచ్చిన మామిడి కాయలు మట్టిపాలయ్యాయి. నిన్నటి వరకు ‘సిరి’ని ఇస్తుందనుకున్న పొలం.. కన్నీటిని మిగిల్చింది.

మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
సోమవారం 06-04-2026

# మత్తు వద్దు.. మైదానమే ముద్దు

**హైదరాబాద్ ఏప్రిల్ 05:** క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదు, దేశ ప్రతిష్ఠను ప్రపంచ యవనికపై నిలిపే ఆయుధాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా పోలీసు ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఆయన, క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపుతూనే, దేశంలోని క్రీడా ముఖచిత్రాన్ని మార్చాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

**నైపుణ్యానికి అండగా.. క్రీడాకారులకు భరోసా**
ప్రతిభ ఉన్నా పేదరికం, ప్రోత్సాహం లేక వెనుకబడిపోతున్న క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తోందని సీఎం పునరుద్ఘాటించారు. బాక్సింగ్ విజేత నిఖత్ జరీన్, క్రికెటర్ సిరాజ్ వంటి వారికి గౌరవప్రదమైన ఉద్యోగాలు, ఆర్థిక సాయం అందించడం ద్వారా "మీ వెనుక ప్రభుత్వం ఉంది" అనే భరోసా కల్పించామని ఆయన పేర్కొన్నారు.

**డ్రగ్స్ రక్కసిపై ఆందోళన: యువత మేల్కోక తప్పదు**
యువత శారీరక దృఢత్వంపై దృష్టి పెట్టాల్సిన సమయంలో, మత్తు పదార్థాల బారిన పడటం పట్ల ముఖ్యమంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పంజాబ్ వంటి రాష్ట్రాల్లో యువత జీవితాలు డ్రగ్స్ వల్ల చిన్నాభిన్నం అయ్యాయని గుర్తు చేస్తూ, హైదరాబాద్‌లో అడుగుపెడుతున్న ఈ విష సంస్కృతిని ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసులను ఆదేశించారు. "క్రీడా మైదానాలు నిండితేనే.. మత్తు భూతానికి తావుండదు" అన్న కోణంలో ఆయన ప్రసంగం సాగింది.

**ప్రపంచ స్థాయి వేదికగా గచ్చిబౌలి: జూన్ 2న సరికొత్త ఆరంభం**
ఒలింపిక్స్‌లో 140 కోట్ల భారతీయుల కల నెరవేరాలంటే అంతర్జాతీయ స్థాయి వసతులు ఉండాలని భావించిన సీఎం, గచ్చిబౌలి స్టేడియాన్ని ప్రపంచ స్థాయి క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు ప్రకటించారు. దక్షిణ కొరియా పర్యటనలో గమనించిన అంశాల ఆధారంగా 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేస్తూ, క్రీడల్లో తెలంగాణను దేశానికే మార్గదర్శిగా నిలపాలని నిర్ణయించారు.

## ఎంఆర్ఐకి హీలియం గ్రహణం!

అసాధారణమైన చల్లదనం (మైనస్ 269 డిగ్రీల సెల్సియస్) వద్ద ఉండాలి. ఇంతటి గడ్డకట్టే చల్లదనాన్ని కేవలం లిక్విడ్ హీలియం మాత్రమే ఇవ్వగలదు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం వల్ల ఈ గ్యాస్ సరఫరా చేసే ఖతార్ వంటి దేశాల నుంచి దిగుమతులు నిలిచిపోయాయి.

**సామాన్యుడిపై 'ధరల' దాడి**
ప్రస్తుతం ఒక ఎంఆర్ఐ స్కాన్ కోసం ప్రైవేటు ఆసుపత్రుల్లో ?6,000 నుంచి ?9,000 వరకు వసూలు చేస్తున్నారు. హీలియం కొరత సాకుతో ఈ ధరలను మరింత పెంచే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 10 శాతం యంత్రాల్లో నిల్వలు నిండుకున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే స్కాన్ సెంటర్లు బోర్డులు తిప్పేయక తప్పని పరిస్థితి.

**వైద్య రంగంపై పడుతున్న ప్రభావం:**
రోగ నిర్ధారణలో జాప్యం: క్యాన్సర్ గడ్డలు, నరాల సమస్యలను గుర్తించడం కష్టమవుతుంది.
**ప్రభుత్వ ఆసుపత్రులపై ఒత్తిడి:** ప్రైవేటులో ధరలు పెరిగితే సామాన్యులంతా సర్కారు దవాఖానాలకే క్యూ కడతారు.
**చిన్న యంత్రాల పరిమితి:** హీలియం అవసరం లేని చిన్న యంత్రాలు ఉన్నా, అవి కేవలం ఎముకల పరీక్షలకే పరిమితం (0.3 టెస్లా సామర్థ్యం మాత్రమే).

**ప్రత్యామ్నాయం ఏది?**
కేంద్ర ప్రభుత్వం అర్జెంటీనా వంటి దేశాల వైపు చూస్తున్నా, అది తక్షణమే సాధ్యమయ్యే పని కాదు. ఢిల్లీలోని ఇండియన్ రేడియోలాజికల్ అసోసియేషన్ ఇప్పటికే కేంద్రానికి లేఖ రాసి, ఈ "ఆరోగ్య సంక్షోభాన్ని" నివారించాలని కోరింది.

## మాకు 'బ్లాక్ బాక్స్' నిజాలు కావాలి!

**ఢిల్లీ ఏప్రిల్ 05:** గతేడాది అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘోర కలికాల్లో తమ వారిని కోల్పోయిన కుటుంబాలు, ఏడాది గడుస్తున్నా నేటికీ ప్రమాదానికి గల అసలు కారణాలు తెలియక ఆవేదన చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో, గుజరాత్‌కు చెందిన 30 బాధితుల కుటుంబాలు శనివారం సమావేశమై, ప్రధాని నరేంద్ర మోదీకి తమ గోడును వెళ్లబోసుకుంటూ లేఖ రాశాయి.

**బ్లాక్ బాక్స్ డేటాపై పట్టుబట్టిన కుటుంబాలు**
విమాన ప్రమాదానికి దారితీసిన సాంకేతిక కారణాలేమిటి? కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (జుం=)లో ఏముంది? అన్న విషయాలను తెలుసుకోవడం తమ హక్కు అని బాధితులు లేఖలో పేర్కొన్నారు.
**డిమాండ్:** ఇంకా వెల్లడికాని బ్లాక్ బాక్స్ డేటాను బహిరంగపరచాలి. భద్రతా కారణాల దృష్ట్యా బహిరంగంగా వెల్లడించడం వీలుకాకపోతే, కనీసం మృతుల కుటుంబ సభ్యులకైనా ఆ సమాచారాన్ని వ్యక్తిగతంగా అందజేయాలని కోరారు. ఈ లేఖ ప్రతులను ఏఏఐబీ , డీజీసీఏ , మరియు గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌కు కూడా పంపారు.
ఎయిరిండియా వైఖరిపై విమర్శలుప్రమాదం జరిగి ఇంత కాలమైనా, మృతులకు సంబంధించిన వ్యక్తిగత సామాగ్రిని అప్పగించడంలో ఎయిరిండియా విఫలమైందని బాధితులు ఆరోపిస్తున్నారు. విమానయాన సంస్థ నుంచి తమకు సరైన సహకారం అందడం లేదని, కనీస బాధ్యత కూడా ప్రదర్శించడం లేదని వారు విమర్శించారు.
**ఘటన నేపథ్యం - దర్యాప్తు పురోగతి**గత ఏడాది జూన్ 12న ఎయిరిండియాకు చెందిన171 (బోయింగ్ 787-8) విమానం అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన కొద్ది క్షణాలకే కూలిపోయింది. ఈ ప్రమాదంలో 241 మంది ప్రయాణికులు, 19 మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, కేవలం ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు.ఏఏఐబీ గత జూలైలో ప్రాథమిక నివేదికను విడుదల చేసింది.పూర్తిస్థాయి దర్యాప్తు నివేదిక వచ్చే జూన్ నాటికి వచ్చే అవకాశం ఉంది.

## ఏజెన్సీలో భూకంపం

పాడేరు ఏప్రిల్ 05: అల్లూరి సీతారామరాజు జిల్లాలో శనివారం అర్ధరాత్రి వేళ భూమి కంపించడంతో ఏజెన్సీ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రాత్రి 11:30 గంటల సమయంలో అరకు వ్యాలీ, పాడేరు, పెదబయలు, హుకుంపేట తదితర ప్రాంతాల్లో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. రిక్టర్ స్కేల్‌పై ఈ భూకంప తీవ్రత 4.4గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.
**భయంతో రోడ్లపైకి పరుగులు:** గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఒక్కసారిగా భూమి కంపించడంతో ఇళ్లలోని వస్తువులు కిందపడిపోయాయి. ఏం జరుగుతుందో అర్థం కాక స్థానికులు భయాందోళనతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అరకు, పాడేరు ప్రాంతాల్లోనే కాకుండా, దీని ప్రభావం విశాఖపట్నంలోని కొన్ని ప్రాంతాల్లో కూడా స్వల్పంగా కనిపించింది. సుమారు కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ప్రజలు రాత్రంతా కంటిమీద కునుకు లేకుండా గడిపారు.
**సిస్మిక్ జోన్ ప్రభావమేనా?:** అరకు - పాడేరు ప్రాంతం సిస్మిక్ జోన్ పరిధిలో ఉండటం వల్లే ఇలాంటి ప్రకంపనలు సంభవిస్తున్నాయని భూగర్భ శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. భూమి అంతర్భాగంలో జరిగే పలకల కదలికల వల్ల ఈ ప్రాంతంలో అప్పుడప్పుడు స్వల్ప భూకంపాలు రావడం సహజమేనని, అయితే 4.4 తీవ్రత అనేది సాధారణం కంటే కొంత ఎక్కువేనని వారు పేర్కొంటున్నారు.
**అప్రమత్తంగా ఉండాలి:** ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించనప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం సూచించింది. ప్రకంపనలు వచ్చినప్పుడు ఇళ్ల లోపల ఉండకుండా ఖాళీ ప్రదేశాలకు రావాలని అధికారులు కోరుతున్నారు.

# ముహూర్తమెప్పుడూ...

పడుతోంది. 34కు పైగా లేఖలు రాసినా, వివరణలు కోరినా ప్రాజెక్టు ఇంజినీర్లు ఉలుకూ పలుకూ లేకుండా ఉండటం వెనుక అంతరార్థం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ముందే తెలిసినా మొద్దునిద్ర..**
బ్యారేజీ కుంగకముందే, అంటే 'డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్' (లోపాల బాధ్యత కాలం)లో ఉన్నప్పుడే కింది స్థాయి ఇంజినీర్లు హెచ్చరించారు. చిన్నపాటి మరమ్మతులు చేస్తే సరిపోయే చోట, పైస్థాయి అధికారులు కళ్ళు మూసుకోవడం వల్లే నేడు మేడిగడ్డకు ఈ దుస్థితి పట్టిందని ఇంజినీరింగ్ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. తప్పులు తెలిసినా బ్యాంకు గ్యారంటీలు వెనక్కి ఇచ్చేయడం, పని పూర్తయినట్లు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం వంటి చర్యలు ఇప్పుడు అధికారుల మెడకు చుట్టుకుంటున్నాయి.

**కమిషన్ల నివేదికలు బేఖాతరు!**
విజిలెన్స్ రిపోర్ట్ తో పాటు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని స్పష్టం చేశాయి. ఒకవేళ వారు ముందుకు రాకపోతే ప్రభుత్వమే పనులు పూర్తి చేసి, ఆ ఖర్చును వారి నుండి వసూలు చేయాలని సూచించాయి. ఇన్ని స్పష్టమైన ఆదేశాలు ఉన్నా, తుది నోటీసులు జారీ చేయడంలో ఇంజినీర్లు ఎందుకు తాత్సారం చేస్తున్నారనేది అక్షరాలా ప్రజాధనం దుర్వినియోగమేనని విశ్లేషకులు భావిస్తున్నారు.
**మంత్రి సమీక్షే ఆశ కిరణం?** ప్రాజెక్టు ఇంజినీర్ల మౌనం, పునరుద్ధరణలో జాప్యంపై నీటిపారుదల శాఖ మంత్రి మళ్ళీ సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టు గాలిలో దీపంలా మారకుండా ఉండాలంటే, ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించాల్సిన సమయం ఆసన్నమైంది.

## వడగండ్ల వాన.. అన్నదాతకు గుండె కోత

హైదరాబాద్ డెస్క్ ఏప్రిల్ 5: : ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు శనివారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలను వణికించింది. రంగు మారిన ఆకాశం, ఉరుములు, మెరుపుల మధ్య కురిసిన రాళ్లవాన అన్నదాతల ఆశలపై పిడుగులా పడింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలవాలగా, నోటికాడికి వచ్చిన మామిడి కాయలు మట్టిపాలయ్యాయి. నిన్నటి వరకు 'సిరి'ని ఇస్తుందనుకున్న పొలం.. నేడు కన్నీటిని మిగిల్చింది.

**మరిమడ్ల నుంచి కమ్మరిపేట వరకు.. అంతా నష్టమే!**
కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో ప్రకృతి సృష్టించిన బీభత్సం వర్ణనాతీతం. సుమారు 120 మంది రైతులకు చెందిన 250 ఎకరాల్లో వరి పంట వడగండ్ల దెబ్బకు రాలిపోయింది. "ఏడాది పొడవునా పడ్డ కష్టం అంతా ఒక్క గంటలో గాలిలో కలిసిపోయింది" అని రైతులు గుండె పగిలేలా రోదిస్తున్నారు. కమ్మరిపేట తండాలోనూ గిరిజన రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.

**అప్పుల కుప్పలో రైతు: భీమయ్య కన్నీటి గాథ**
ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లో ఒక హృదయవిదారక ఉదంతం వెలుగుచూసింది. అబ్బేని భీమయ్య అనే అద్దె రైతు, ముదిరాజ్ సంఘం నుంచి 6.5 ఎకరాల మామిడి తోటను రూ. 5 లక్షలకు అద్దెకు తీసుకున్నాడు. మరో కొద్ది రోజుల్లో కాయలు మార్కెట్‌కు వెళ్తాయనుకుంటున్న తరుణంలో రాళ్లవాన దెబ్బకు తోటంతా ఖాళీ అయిపోయింది. కాయలన్నీ నేలరాలిపోవడంతో, పెట్టిన పెట్టుబడి పోగా.. నెత్తిన పడ్డ అప్పు ఎలా తీర్చాలో తెలియక భీమయ్య కన్నీరుమున్నీరవుతున్నాడు.

**మార్కెట్ యార్డుల్లో తడిసిన 'బంగారం'**
పొలాల్లోనే కాదు, కష్టపడి మార్కెట్ యార్డులకు తెచ్చిన ధాన్యం కూడా అకాల వర్షానికి తడిసి ముద్దయింది. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మార్కెట్ యార్డులో రైతులు ఆరబోసిన వడ్లు వరద నీటిలో కొట్టుకుపోయాయి. అటు నిజామాబాద్ రూరల్ మాధవనగర్‌లో పిడుగుపాటుకు ఐదు గేదెలు మృత్యువాత పడటంతో ఆ కుటుంబం జీవనాధారాన్ని కోల్పోయింది.

**ప్రభుత్వ సాయం కోసం ఆర్తనాదాలు**
దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే షకీల్ తదితరులు, ప్రభుత్వాన్ని తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. కేవలం పర్యటనలతో సరిపెట్టకుండా, యుద్ధ ప్రాతిపదికన నష్టాన్ని అంచనా వేసి, కౌలు రైతులతో సహా అందరికీ పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

# మృత్యుపాశమైన మినీట్రక్

**హైదరాబాద్:** భాగ్యనగరంలో శనివారం అర్ధరాత్రి ఒక రాక్షస మినీట్రక్ బీభత్సం సృష్టించింది. మానవత్వం మంటగలిసిన ఆ డ్రైవర్ నిర్లక్ష్యం, ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకోవడమే కాకుండా, ఒక పచ్చని సంసారంలో అంతులేని చీకటిని నింపింది. స్కూటీని ఢీకొట్టడమే కాకుండా, దంపతులు వాహనం కింద ఇరుక్కుపోయారని తెలిసినా కనికరం లేకుండా 5 కిలోమీటర్ల మేర ఈడ్చుకెళ్లిన ఘటన నగరవాసులను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.

**సినిమా చూసి వస్తుండగా.. మృత్యువు రూపంలో!**
కేరళకు చెందిన అబ్దుల్ బాసిత్ (26), అయేషా (22) దంపతులు రెండేళ్ల క్రితమే వివాహం చేసుకుని కొత్త ఆశలతో హైదరాబాద్‌కు వలస వచ్చారు. మహేశ్వరంలో ఉంటూ మలబార్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్న బాసిత్, శనివారం రాత్రి భార్యతో కలిసి కూకట్‌పల్లిలో సినిమా చూసి ఆనందంగా ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మాదాపూర్ మైండ్ స్పేస్ అండర్ పాస్ వద్ద వేగంగా వచ్చిన మినీట్రక్ వీరి స్కూటీని బలంగా ఢీకొట్టింది.

**మానవత్వం మర్చిపోయిన డ్రైవర్.. వెంటాడిన యువత**
ప్రమాదం జరిగిన వెంటనే వాహనం ఆపాల్సింది పోయి, భయంతోనో లేక బాధ్యతారాహిత్యంతోనో డ్రైవర్ ట్రక్కును ఆపకుండా జూబ్లీహిల్స్ వరకు పోనిచ్చాడు. స్కూటీ కింద పడటంతో బాసిత్ పక్కకు పడి ప్రాణాలతో బయటపడగా, అయేషా మాత్రం ఆ రాక్షస వాహనం కింద చిక్కుకుపోయింది. ఆమె కింద ఉందని తెలిసి కూడా డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడిపాడు. గమనించిన కొందరు సాహసవంతులైన యువకులు తమ ప్రాణాలకు తెగించి ట్రక్కును వెంబడించి, జూబ్లీహిల్స్ వద్ద అతికష్టం మీద అడ్డుకుని ఆపారు.

**ఆసుపత్రికి చేరేలోపే.. ఆరిపోయిన దీపం**
యువకులు వాహనాన్ని ఆపగానే డ్రైవర్ పరారు కాగా, క్లీనర్ పట్టుబడ్డాడు. తీవ్రంగా గాయపడిన అయేషాను తక్షణమే ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కేవలం 22 ఏళ్ల వయసులోనే, ఎన్నో కలలతో ఉన్న ఒక అభాగ్యురాలు ఇలా రోడ్డు ప్రమాదానికి బలికావడం స్థానికంగా విషాదం నింపింది.
**న్యాయం కోసం బాధితుల డిమాండ్** మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న డ్రైవర్ కోసం గాలిస్తున్నారు. "మా బిడ్డను పొట్టన పెట్టుకున్న ఆ కిరాతకుడిని కఠినంగా శిక్షించాలి" అని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. అతివేగం, మద్యం మత్తు లేదా నిర్లక్ష్యం.. కారణం ఏదైనా ఒక నిండు ప్రాణం బలైపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# టెన్షన్.. టెన్షన్!

**బెంగళూరు ఏప్రిల్ 05**: బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఢిల్లీ వెళ్లాల్సిన ఇండిగో విమానం మరికొద్ది నిమిషాల్లో రన్‌వేపైకి వెళ్లాల్సి ఉండగా, బాంబు బెదిరింపు రావడంతో ప్రయాణికులు ప్రాణభయంతో వణికిపోయారు. అందరూ సీట్లలో కూర్చుని ప్రయాణానికి సిద్ధమవుతున్న తరుణంలో ఈ కలకలం రేగింది.

**టిష్యూ పేపర్‌పై 'మృత్యు' లేఖ**
విమానంలోని వాష్‌రూమ్‌కు వెళ్లిన ఒక ప్రయాణికుడికి అక్కడ ఉన్న టిష్యూ పేపర్‌పై రాసి ఉన్న ఒక నోట్ కనిపించింది. అందులో "విమానంలో పేలుడు పదార్థం ఉంది" అని రాసి ఉండటాన్ని గమనించిన సదరు ప్రయాణికుడు వెంటనే విమాన సిబ్బందిని అప్రమత్తం చేశాడు. పైలట్లు ఈ సమాచారాన్ని వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ కి చేరవేయడంతో భద్రతా దళాలు రంగంలోకి దిగాయి.
**తనిఖీలతో ఊపిరి పీల్చుకున్న అధికారులు** సమాచారం అందిన వెంటనే బాంబు స్క్వాడ్, భద్రతా సిబ్బంది విమానాన్ని చుట్టుముట్టారు. ప్రయాణికులందరినీ కిందికి దింపి, విమానం మూలమూలలా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గంటల తరబడి సాగిన ఈ సోదాల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువు లభించకపోవడంతో అధికారులు అది 'ఫేక్ కాల్' (నకిలీ బెదిరింపు) అని తేల్చారు. ఆ తర్వాత విమానం తిరిగి ఢిల్లీకి సురక్షితంగా బయల్దేరింది.
**1,100 బెదిరింపులు.. కిలాడీ అరెస్ట్!** విమానాలకు ఇలాంటి నకిలీ బెదిరింపులు పంపడం ఇటీవల ఒక ఫ్యాషన్‌గా మారింది. ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతున్న మైసూరుకు చెందిన ఒక వ్యక్తిని ఢిల్లీ పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. విచారణలో తేలిన ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. అతడు ఇప్పటివరకు ఏకంగా 1,100 బాంబు బెదిరింపులకు పాల్పడినట్లు గుర్తించారు. ఇలాంటి వారి వల్ల విమానయాన సంస్థలకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లడమే కాకుండా, ప్రణికులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారు.

## వ్యూహాత్మక విజయం

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరినప్పటికీ, కీలకమైన హర్మూజ్ జలసంధి గుండా భారత నౌకల ప్రయాణం నిరంతరాయంగా సాగుతోంది. తాజాగా భారత్‌కు చెందిన ఎల్పీజీ నౌక 'గ్రీన్ ఆశా' ఈ ప్రమాదకర మార్గాన్ని సురక్షితంగా దాటింది.
వరుసగా సాగుతున్న నౌకల రాకపోకలు
పశ్చిమాసియా సంక్షోభం మొదలైనప్పటి నుంచి ఈ మార్గంలో ప్రయాణించిన నౌకల **వివరాలు:**
గ్రీన్ శాన్వి: శనివారం ఈ జలసంధిని దాటిన 8వ భారత నౌక.
గ్రీన్ ఆశా: ఆదివారం విజయవంతంగా లక్ష్యాన్ని చేరిన 9వ నౌక.
గత రికార్డులు: అంతకుముందు బీడబ్ల్యూ టైర్, బీడబ్ల్యూ ఎల్మ్ వంటి భారీ నౌకలు సుమారు 94,000 టన్నుల కార్గోను రవాణా చేశాయి.

**హర్మూజ్ జలసంధి ఎందుకు అంత కీలకం?**
ప్రపంచ ముడి చమురు సరఫరాలో 20% కంటే ఎక్కువ భాగం ఈ ఇరుకైన జలసంధి గుండానే సాగుతుంది. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ దాడుల తర్వాత ఇరాన్ ఈ మార్గంపై పట్టు బిగించింది. శత్రు దేశాల నౌకలను అడ్డుకుంటున్న ఇరాన్, భారత్ వంటి మిత్రదేశాల నౌకలకు మాత్రం మినహాయింపునిస్తూ అనుమతిస్తోంది. ఇది భారత్-ఇరాన్ మధ్య ఉన్న బలమైన దౌత్య సంబంధాలకు నిదర్శనం పశ్చిమాసియాలో యుద్ధ భయం నెలకొన్నప్పటికీ, భారత నౌకలు సురక్షితంగా ప్రయాణించడం వెనుక భారత విదేశాంగ శాఖ జరుపుతున్న చర్చలు మరియు నౌకాదళం అందిస్తున్న అప్రకటిత భద్రత కీలక పాత్ర పోషిస్తున్నాయి. దేశీయంగా గ్యాస్, పెట్రోల్ ధరలు స్థిరంగా ఉండాలంటే ఈ మార్గం గుండా రవాణా సాగడం భారత్‌కు అత్యంత అవసరం.

## ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో

# బాబూ జగ్జీవన్ రామ్ జయంతి

**చేగుంట ఏప్రిల్ 0 5 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల కేంద్రంలోబాబు జగ్జీవన్ రామ్ జయంతి పురస్కరించుకొని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో చేగుంట మండల కేంద్రంలోని అతని విగ్రహానికి పూలమాల వేసిన ఉపాధ్యాయ సంఘ నాయకులు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకుడు చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ 1946లో అతను జవహర్‌లాల్ నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో అతి పిన్న వయస్కుడైన మంత్రిగా, భారతదేశపు మొట్టమొదటి క్యాబినెట్ కార్మిక మంత్రి గా, భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా పనిచేశాడు అని,1971 ఇండో-పాక్ యుద్ధం జరిగిన సమయంలో భారత రక్షణ మంత్రిగా బంగ్లాదేశ్ ఏర్పాటులో కీలక పాత్ర వహించాడని,





భారతదేశంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవం, భారత వ్యవసాయాన్ని అతనికరించాడని , 1974 కరువు సమయంలో ఆహార సంక్షోభాన్ని నివారించటానికి ప్రత్యేకంగా అదనపు మంత్రిత్వ శాఖను నిర్వహించమని కోరినప్పుడు అంగీకారం తెలుపటం ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన విషయం అని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు వరాల నర్సిములు, గందె పాండు, చల్లా రామకృష్ణ, యాదగిరి, సత్యనారాయణ, సిద్ధిరాములు, సురేందర్, దేవానంద్, విష్ణు తదితరులు పాల్గొన్నారు

# అమీన్పూర్ మండలంలో రేషన్ బియ్యం కోసం పోటెత్తిన జనం

## ఇబ్బందుల్లో డీలర్లు మరియు లబ్ధిదారులు

**అమీన్ పూర్ ఏప్రిల్ 05 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించడంతో, అమీన్పూర్ మండల పరిధిలోని రేషన్ షాపుల వద్ద జనసందోహం నెలకొంది. ఉదయం నుండే వేలాది మంది ప్రజలు రేషన్ బియ్యం కోసం క్యూ లైన్లలో వేచి ఉండటంతో అటు ప్రజలు, ఇటు డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రధాన సమస్య: బయోమెట్రిక్ (తంబ్) ప్రక్రియ

ప్రభుత్వం మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తున్నప్పటికీ, సాంకేతికంగా ఒక్కో నెలకు ఒక్కోసారి చొప్పున మొత్తం మూడు సార్లు బయోమెట్రిక్ (తంబ్) వేయించుకోవాల్సి వస్తోంది. దీనివల్ల:

ఒక్కో వ్యక్తికి దాదాపు 20 నిమిషాల సమయం పడుతోంది.

సర్వర్లు నెమ్మదించడం, సాంకేతిక లోపాలతో పంపిణీ ప్రక్రియ మరింత జాప్యం అవుతోంది. ఎండ తీవ్రత దృష్ట్యా గంటల తరబడి వేచి ఉండటం వృద్ధులకు, మహిళలకు భారంగా మారింది.

డీలర్ల విన్నపం

ఈ సందర్భంగా అమీన్పూర్ రేషన్ డీలర్లు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ గారు మరియు స్థానిక ఎమ్మార్వో గారు స్పందించి, మూడు నెలలకు కలిపి ఒకేసారి తంబ్ తీసుకునేలా సాఫ్ట్వేర్లో మార్పులు చేయాలని కోరుతున్నారు. ఇలా చేయడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా రద్దీని త్వరగా తగ్గించవచ్చని వారు తెలిపారు.

ఆందోళన వద్దు – అందరికీ బియ్యం అందుతాయి

రద్దీని దృష్టిలో ఉంచుకుని డీలర్లు ప్రజలకు కీలక విన్నపం చేశారు: "ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ నెల 30వ తేదీ వరకు ఖచ్చితంగా అందరికీ బియ్యం పంపిణీ చేస్తాము. స్టాక్ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రజలు సహకరించి, క్రమ పద్ధతిలో బియ్యం తీసుకోవాలి."

అధికారుల దృష్టికి..

అమీన్పూర్ మండలంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రేషన్ పంపిణీ వేగవంతం కావాలంటే, ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని బయోమెట్రిక్ ప్రక్రియను సరళతరం చేయాలని అటు డీలర్లు, ఇటు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.






# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న వడ్ల నవీన్ కుమార్

**చేగుంట ఏప్రిల్ 5 మెదక్ టుడే న్యూస్**చేగుంట మండలం చందాయిపేట్ గ్రామంలో శివనూరి విజయ్ -మమత దంపతులు నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి చేగుంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, గ్రామ సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా పాల్గొన్నారు. నూతన గృహాలలో అడుగుపెట్టిన లబ్ధిదారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశీస్సులతో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చడం,మంత్రి ముఖ్య లక్ష్యమని, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అనేక మంది కుటుంబాలు ఆనందంతో కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్నాయని తెలిపారు.ఇంటి అనేది ప్రతి కుటుంబానికి భద్రత, గౌరవం, సంతోషానికి ప్రతీక అని చందాయిపేట్ గ్రామ సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా పేర్కొంటూ, ఈ పథకం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా, ఉపసర్పంచ్ పబ్బ నగేష్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మసాయిపేట్ శ్రీనివాస్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు మొహమ్మద్ ముజామిల్, స్టాలిన్ నర్సిములు, బల్ రెడ్డి, కాషాబోయిన శ్రీనివాస్,చేగుంట యూవనాయకులు సంద్రుగు శ్రీకాంత్ ప్రజాప్రతినిధులు, పార్టీ స్థానిక నాయకులు మాణిక్యం రెడ్డీ, స్వామి గౌడ్, అచంపేట్ స్వామి, బాస రాజు, బైండ్ల శివరాజయ్యా, కార్యకర్తలు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# చేగుంట మండల కేంద్రంలో ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

## అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్

**చేగుంట ఏప్రిల్ 5 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడినవి భారతదేశ సామాజిక, రాజకీయ చరిత్రలో అణగారిన వర్గాల గొంతుకను వినిపించిన మహోన్నత వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్, అని చేగుంట గ్రామ సర్పంచ్ సంద్రగు ప్రవంతి సతీష్, అంబేద్కర్ సంఘం నాయకులు ఉపాధ్యాయ సంఘాలు కొనియాడారు. ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను పురస్కరించుకొని, చేగుంట లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో జన్మించి, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలను ఎదుర్కొని దేశ ఉప ప్రధాని స్థాయికి ఎదిగిన బాబుజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో దళితులు, వెనుకబడిన వర్గాలు ఎదుర్కొంటున్న వివక్షను రూపుమాపేందుకు ఆయన పార్లమెంటు లోపల, బయట నిరంతరం శ్రమించారని గుర్తుచేశారు.సామాజిక న్యాయం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, అణగారిన వర్గాలకు ప్రభుత్వ ఫలాలు అందేలా చూడటంలో ఆయన కీలక పాత్ర పోషించారని వివరించారు.దేశం కరువు కాటకాలతో అలమటిస్తున్న తరుణంలో, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా బాబు జగ్జీవన్ రామ్ చూపిన చొరవ అద్వితీయమని కొని ఆడారు అనంతరం చేగుంట గ్రామానికి చెందిన స్టాలిన్ నర్సింలు కుమారుడు రామ్ చరణ్ తేజ్ ,పుట్టినరోజు వేడుక నిర్వహించారు ఈ కార్యక్రమంలో చేగుంట గ్రామ సర్పంచ్ సంద్రుగు ప్రవంతి,సతీష్, ఉపసర్పంచ్ మొహమ్మద్ రఫీక్, వార్డ్ మెంబర్లు,అంబేద్కర్ యువజన సంఘ అధ్యక్షులు విష్ణు, నాయకులు ఉపాధ్యాయ సంఘాలు పార్టీ నాయకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు





# బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం: అడెల్లి రవీందర్

**అమీన్ పూర్ ఏప్రిల్ 05(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

దేశాభివృద్ధి కేవలం భారతీయ జనతా పార్టీతోనే



సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ బీజేపీని బలపరచాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడెల్లి రవీందర్ పిలుపునిచ్చారు.

జెండా ఆవిష్కరణ:

బీజేపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పునస్కరించుకొని పార్టీ కేంద్ర కార్యాలయ పిలుపు మేరకు, బీరంగూడలోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అడెల్లి రవీందర్ మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు:

మోదీ నాయకత్వం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలనలో భారతదేశం ప్రపంచ దేశాల సరసన అగ్రగామిగా నిలుస్తోందని కొనియాడారు.

అభివృద్ధి మంత్రం: బీజేపీ అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని, అభివృద్ధి వేగవంతం అవుతుందని పేర్కొన్నారు.

గల్లీ నుండి ఢిల్లీ వరకు: దేశాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని, 'గల్లీ నుంచి ఢిల్లీ వరకు' బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏఎంసి డైరెక్టర్ కుమారుని జన్మదిన వేడుకల్లో పాల్గొన సంద్రుగు ప్రవంతిసతీష్.

## అమహనీయుడి పుట్టినరోజు నాడే నీ యొక్క పుట్టినరోజు వేడుక జరగడం సంతోషకరం అన్న సర్పంచ్

**చేగుంట ఏప్రిల్ 5 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల



కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఏఎంసి డైరెక్టర్ స్టాలిన్ నర్సింలు పెద్ద కుమారుడు రామ్ చరణ్ తేజ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న గ్రామ సర్పంచ్ ప్రవంతి, సతీష్, మాట్లాడుతూ ఈ వేడుక మహానేత డాక్టర్. బాబుజగ్జీవన్ రామ్, జయంతి రోజే జన్మదినవేడుకలు జరగడం తాను ఏ జన్మ బంధము పుణ్యమో మహనీయుడి పుట్టినరోజు నాడే ఈ యొక్క పుట్టినరోజు వేడుక జరగడం సంతోషకరం అని అన్నారు ఈకార్యక్రమంలో చేగుంట సర్పంచ్ సంద్రగు ప్రవంతి,సతీష్, ఉప సర్పంచ్ రఫిక్, వార్డు సభ్యులు ఆరిఫ్,నిమ్మ సాయిబాబా,బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎర్ర యాదగిరి, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు మద్దూరి రాజు, తలారి లింగం, మ్యాతరి నాగరాజు,అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**అమీన్‌పూర్ జిహెచ్ఎంసి కార్యాలయంలో నివాళులర్పించిన అధికారులు**



**అమీన్‌పూర్ ఏప్రిల్ 05(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, స్వేచ్ఛ, సమానత్వ హక్కుల సాధన కోసం పోరాడిన గొప్ప సంస్కర్త, మాజీ కేంద్ర మంత్రి కీ.శే. శ్రీ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలో ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం అమీన్‌పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో సి.ఎం.సి కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పార్చన చేసి అధికారులు, సిబ్బంది ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సుమారు 30 సంవత్సరాల పాటు కేంద్ర క్యాబినెట్ మంత్రిగా వివిధ శాఖల్లో బాబు జగ్జీవన్ రామ్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశాభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో కీలకమని గుర్తు చేసుకున్నారు.. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ, సహాయ మున్సిపల్ కమిషనర్లు టి. నర్సింహులు, సాయిలు, అసిస్టెంట్ ఇంజనీర్ తిరుమలేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జన్మదిన వేడుకలు

**రేణిగుంట ఏప్రిల్ 05,** మాజీ మంత్రివర్యులు గల్లా అరుణ కుమారి మరియు అమర రాజా వ్యవస్థాపక అధ్యక్షుడు గల్లా రామచంద్ర నాయుడు ఆధ్వర్యంలో, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ కీ.శే. పాటూరు రాజగోపాల్ నాయుడు 106వ జయంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం దిగువమాగం గ్రామంలోని రాజన్న మెమోరియల్ పార్క్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమర హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గౌరీనేని ప్రసాద్ , మేనేజింగ్ డైరెక్టర్ గౌరీనేని రమాదేవి తో కలిసి రాజగోపాల్ నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులు అర్పించారు. అదేవిధంగా, గల్లా అరుణ కుమారి మనవడు, యువ హీరో గల్లా అశోక్ జన్మదినం సందర్భంగా అభిమానులు మరియు సమీప గ్రామాల ప్రజలు భారీ కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌరీనేని ప్రసాద్ మాట్లాడుతూ, పాటూరు రాజగోపాల్ నాయుడు జీవితం యువతకు ఆదర్శప్రాయమని, ఆయన తీసుకున్న సంస్కరణలు అనేక మంది విద్యార్థుల పురోగతికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. గౌరీనేని రమాదేవి మాట్లాడుతూ, రాజగోపాల్ నాయుడు రాష్ట్ర అభివృద్ధికి విశేష సేవలు అందించారని, ముఖ్యంగా విద్య, వైద్య రంగాలలో అనేక సంస్కరణలకు కృషి చేశారని తెలిపారు. ఆయన జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గల్లా అరుణ కుమారి మాట్లాడుతూ, తన తండ్రి మరియు మనవడు అశోక్ జన్మదినాలు ఒకే రోజు రావడం ఆనందదాయకమని, ఇద్దరికీ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అశోక్ సినీరంగంలో మరింత ఎదగాలని ఆకాంక్షించారు. గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ, రాజగోపాల్ నాయుడు అనేక మందికి మార్గదర్శిగా నిలిచారని కొనియాడి, అశోక్‌కు ఆశీర్వాదాలు అందించారు.

ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కోలాటాలు మరియు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో దిగువమాగం మాజీ సర్పంచులు కుమార్ నాయుడు, గోపి, గల్లా రాధాకృష్ణ, రాజన్న ఫౌండేషన్ హెడ్ రాళ్లపల్లి సతీష్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గల్లా అశోక్ అభిమానులు సురేష్ ఎల్లంపల్లి తదితరులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## 26 నుండి మే 6 వరకు బ్రహ్మోత్సవాలు

**నెల్లూరు ఏప్రిల్ 5:** నెల్లూరు రూరల్ నరసింహకొండ వద్ద వెలసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 26 వతేదీ నుండి మే -- 6 వతేదీ వరకు నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగా కుండా నిర్వహించాలని రెవిన్యూ డివిజినల్ అధికారి అనుషా, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం నరసింహ కొండలోని సమావేశ హాలులో బ్రహ్మోత్సవాలు నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..... గత సంవత్సరం బ్రహ్మోత్సవాలు నిర్వహణ సమయములో వచ్చిన లోటుపాట్లను పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎండా కాలం ద్రుష్ట్యా వేసవి తాపం తగలకుండా చలువ పందిళ్ళు, మంచినీరు, ఓ.ఆర్.యస్ ప్యాకెట్లు , మజ్జిగ అందచేశాల చర్యలు తీసుకోవాలాన్నారు. క్యూ లైన్లు క్రమ పద్ధతిలో భక్తులకు త్వరితగతిన దర్శనం కలిగేలా ఏర్పాటుచేయాలన్నారు. నిరంతర విధ్యుత్ సరఫరా చేసేలా అవసరమైన చోట ట్రాన్స్ ఫార్మర్లు, జనరేటర్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రథమ చికిత్సా కేంద్రాలు, అత్యవసర మందులు, అంబులెన్సు లు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా పారిశుద్ధ్యపనులు చేపట్టాలని సంబంధిత పంచాయతి అధికారులకు సూచించారు. ఆలయ చైర్మన్ అచ్యుత శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ సిబ్బంది, ధర్మకర్తల మండలి సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలును విజయవంతం అందరు కృషి చేయాలన్నారు

# నీటివనరులపై జీవనం సాగిస్తున్న వారికి అండగా నిలిచిన నీలం మధు ముదిరాజ్..

**సొంత నిధులతో**

**తిమ్మక్క చెరువులో గుర్రపు డెక్క తొలగింపు.**

**పటాన్ చెరు ఏప్రిల్ 05(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** రాజకీయాలంటే కేవలం పదవులు మాత్రమే కాదు, ప్రజల కష్టాల్లో తోడుండటమేనని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ మరోసారి నిరూపించారు. గత కొంతకాలంగా పటాన్ చెరు పట్టణ పరిధిలోని తిమ్మక్క చెరువు గుర్రపుడెక్కతో నిండిపోయి, ఒక చెరువులా కాకుండా మైదానంలా మారిపోయింది. దీనివల్ల నీటిలోని ఆక్సిజన్ తగ్గి చేపలు చనిపోవడమే కాకుండా, దానిపైన జీవనం సాగిస్తున్న వారికి వలలు వేయడానికి కూడా వీలు లేకుండా పోయింది. తమ జీవనోపాధి దెబ్బతిని, మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంలో చాలాసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా స్పందన లేకపోవడంతో, వారు ఈ విషయాన్ని నీలం మధు కి వివరించారు. వారి విన్నపాన్ని విన్న వెంటనే నీలం మధు ప్రభుత్వ నిధుల కోసం, అధికారుల కోసం వేచి చూస్తూ కాలయాపన చేయకుండా, తన సొంత నిధులతో యుద్ధ ప్రాతిపదికన గుర్రపుడెక్క తొలగింపు పనులను ప్రారంభించారు. గత అయిదు రోజుల నుండి జేసీబీ యంత్రాలను రంగంలోకి దించి చెరువును శుభ్రం చేయిస్తున్నారు.

తమ కష్టాన్ని గుర్తించి, సొంత ఖర్చుతో చెరువును పునరుద్ధరిస్తున్న నీలం మధు గారి ఉదారతకు మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. చెరువు గుర్రపుడెక్క నుండి విముక్తి పొందుతుండటంతో, మళ్లీ తమ వలలకు చేపలు చిక్కుతాయని, తమ జీవనోపాధి ముందుకు సాగుతుందని తెలుపుతూ నీలం మధుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపి ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్య రెడ్డి, ఎట్టయ్యా, వెంకటేష్, దేవరాజు, రవి, శ్రీశైలం, గణేష్, నరేందర్, యాదగిరి, లింగం,అర్జున,సాయిలు,మత్స్యకారులు, పటాన్చెరు పట్టణ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయడం అభినందనీయం: ఎమ్మెల్యే జిఎంఆర్

**మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని గెలిచిన వెంటనే అమలు చేయడం అభినందనీయమని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.**

**పటాన్ చెరు ఏప్రిల్ : 05 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డ్ కౌన్సిలర్ సుల్తాన్పురం ఈశ్వరమ్మ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఏర్పాటు చేసిన రెండు రూపాయలకే మినరల్ వాటర్ ప్లాంట్ ను ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ ఆయన మాట్లాడుతూ ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ప్రజలు ఎంతో నమ్మకంతో బిఆర్ఎస్ పార్టీకి అధికారం అందించారని.. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అతి త్వరలో మున్సిపల్ పరిధిలో 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడమైనట్లు తెలిపారు. ప్రతి వార్డు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి. ఆయా వార్డుల కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## కిష్టారెడ్డిపేట్‌లో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి

**– విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్**

**అమీన్‌పూర్ ఏప్రిల్ : 05(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**భారత మాజీ ఉపప్రధాని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి కీ.శే. బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు కిష్టారెడ్డిపేట్ గ్రామంలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.

మాణిక్ యాదవ్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు:

ఈ సందర్భంగా మాణిక్ యాదవ్ మాట్లాడుతూ.. సమాజంలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం బాబు జగ్జీవన్ రామ్ తన జీవితాంతం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు.

వెనుకబడిన వర్గాల అభ్యున్నతి: దళితులు, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, దేశ నిర్మాణంలో ఆయన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు.

ఆశయ సాధన: బాబు జగ్జీవన్ రామ్ చూపిన బాటలోనే మనమంతా నడవాలని, కులమతాలకు అతీతంగా అందరూ సమానత్వంతో మెలిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నాయకత్వ స్ఫూర్తి: ప్రతి ఒక్క కార్యకర్త ఆయన పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కిష్టారెడ్డిపేట్ మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు దర్శన్, దుర్గయ్య, శివ, మల్లేష్, నరసింహ, టింకుతో పాటు పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా ఈస్టర్ వేడుకలు పోలంపల్లిలో

**పునరుదనుడై తిరిగి లేచిన దేవుడు యేసుక్రీస్తు**

**చేగుంట ఏప్రిల్ 5 మెదక్ టుడే న్యూస్** ఈస్టర్ వేడుకలు చేగుంట మండలం పొలంపల్లి గ్రామంలో ఆదివారం నాడు సీయోను ప్రార్ధన మందిరము వ్యవస్థాపకులైన పాస్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు, పాస్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ, యేసు క్రీస్తు శుక్రవారం రోజున సిలువ వేయబడి మూడవ దినమున మరణమును జయించి పునరుత్థాన బలము చేత తిరిగి లేచి ఉన్నాడని మరియు నలభైఅవ దినమున పరలోకానికి ఆరోహణమై పెంతికొస్తు దినమున తన పరిశుద్ధాత్మను మనకు తోడుగా ఉండుటకు లోకానికి తిరిగి పంపించాడని, నేటికి క్రీస్తు సజీవుడై ఉన్నాడని క్రీస్తు తిరిగి మరలా రాబోతున్నాడని, సందేశాన్ని ఇస్తూ మన గ్రామానికి మీ కుటుంబాలకు దేవుడు ఎల్లప్పుడు తోడుగా ఉండాలనీ వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో సీయోను ప్రార్ధన మందిరం సభ్యులు పాల్గొన్నారు,






printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail. medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, 9948265095.9494117870..